ఓంశ్రీసాయిరాం.

మానవ బుద్ధికుశలతనుపయోగించి సాధన సల్పిన, ఆ దివ్యపదవిని పొందగలరు. అతి జాగరూకతగా విచారణగావించిన అన్ని జీవరాసులు పరస్పర సంబంధము కలిగియున్నవనియూ, అన్నియూ భగవత్ శక్తిచే విద్యుత్ దీపముల మాడ్కి వెలుగుచున్నవనియు తెలియును. భగవానుని విరాట్ రూపమున ప్రతియొక్కటియూ అందలి అంశములగుట మీకు గోచరమగును. మానవులు తోటివారిని అభివృద్ధిలోనికి తీసుకొని వచ్చుటకు ప్రయత్నించినప్పుడు వారి కృషి విఫలమైన, మనస్సున విసుగుపుట్టి చేపట్టిన కార్యక్రమమును మానుదురు. అట్లు వారు విఫలత చెందుటకు కారణము ఇతరులయొక్క మనోతత్త్వమును సరిగా గుర్తెరుగకుండుట. లేక, వారిని సక్రమ మార్గమున పెట్టుకు చేసిన ప్రయత్నములు సరియైనవిగాక వుండవచ్చును. ఇతరులకు సేవజేయువారు ముందు తమ హృదయమును ప్రేమతో నింపవలెను.

మనసే మానవుని సంసారబంధములోనికి కాని, విశాలమగు ప్రాంగణములోనికిగాని కొనిపోవుచున్నదని వేదములు ఘోషించుచున్నవి. విషయవాసనల వెంబడి పరుగిడినచో మానవుని అమానుషునిగా మార్చును. అట్లుగాక అనంత ఆనందదాయకములగు ఆధ్యాత్మిక సత్యముల లోతులు గ్రహించ యత్నించినచో అదియే మానవత్వమునుండి దైవత్వమునకు గొనిపోవును. జడ పదార్థములు చైతన్యముతోకూడిన జీవపదార్థములకంటె విభిన్నములని విజ్ఞాన శాస్త్రముచే ఆవిధముగా ఆశ్లేషమొనర్పబడినది. చిత్ పదార్థముల విశ్లేషణము ఆధ్యాత్మిక శాస్త్రమునకు సంబంధించినది. యోగము మనస్సును నిగ్రహించు సాధనమైయున్నది. ప్రస్తుత కాలము విజ్ఞానశాస్త్రము పురోగమించుచున్న యుగము. కాగా ఆధ్యాత్మికోన్నతికి, వేదాంత సాధనకు తగు శ్రద్ధ కనుపించుటయేలేదు.

జీవుడు దేవునియొక్క ప్రతిబింబము. కాగా, మానవుడు భగవంతుని రూపాంతరము. మానవత్వము దివ్యత్వమునకతి సన్నిహితమైనప్పటికినీ సామాన్యముగా మానవుడు ఈ సామీప్యమును గుర్తించుటలేదు. జన్మజన్మాంతరములనుండి తాను యెంతో కృషిచేసి దాటివచ్చిన పశుత్వస్థాయికి తిరిగి తన మనస్సును దిగజార్చుకొనుచున్నాడు. వజ్రము గాజుముక్కవలె కనుపించవచ్చును. దాని విలువ గుర్తించని అజ్ఞానులు మాత్రమే దానిని తమ కార్యాలయములలో కాగితములపై వొత్తిడి రాయిగా ఉపయోగింతురు. సుజ్ఞానులు దానిని భద్రముగా యినుపపెట్టెలో పెట్టి కాపాడుదురు. మానవుడు వజ్రము వంటివాడుగాని గాజుముక్కవంటివాడు కాదు. సంస్కారములచే సానపెట్టబడిన ధగధగ మెరయును.

సంస్కారమే నరుని నారాయణునిగనూ, మానవుని మాధవునిగానూ మార్చును. మన చేతి గడియారము ఐదు, ఆరు లేక పదివందల రూపాయల విలువ కలదై వుండవచ్చును. కాని, దానిని తయారుచేయుటకుపయోగించిన ఉక్కుముక్క కిమ్మత్తు నాలుగైదణాలు మాత్రమే వుండును. పనివాడితనముతో కూడిన మన మేధస్సుతో సంస్కరింపబడినదగుటచే దాని విలువయును, దాని ఉపయోగమును వృద్ధియైనది. ఇట్లే, మానవుడుకూడా తన మనస్సును, తెలివితేటలను తగు విధమున నియమించి, భగవత్ సాక్షాత్కారమునకు ఒక అమూల్య సాధనముగా తన్ను తాను రూపొందించుకొనగలుగును. తన మనస్సనే శక్తివంతమగు రససిద్ధిచే జ్ఞానమును సాధించి సంతృప్తినొసంగుచు భావించు పరమ సత్యమును కనుగొనగలుగును.

తిండి, బట్ట, వసతి సౌకర్యములు సమకూర్చినంత మాత్రముచే మన దేశ ప్రజలకు సుఖశాంతులు కలుగునని నేడు అనేకుల భావన. అవి వలసినంతగా లభింపకపోవుట వలననే వారు బాధలకు లోనగుచున్నారని మనము తలంతుము. అది కేవలము భ్రాంతియే, యేలనన మన సంతృప్తి సంతోషములు మనస్సుయొక్క లక్షణములు. కావున, మనస్సును, శాంతి ఆనందముల లనుభవించునట్లుమనము తయారుచేయవలయును. అదిలేనిచో యెంతటి సుఖభోగములు కలిగియున్ననూ మానవుడు దుఃఖజీవియే అగును. ఒకానొక వ్యక్తి యెంతో ఆనందము, ధనము, బలము, పుష్టి కలిగియున్నప్పటికి, దురదృష్టముచే నాతడు గ్రుడ్డివాడైనచో సమస్త ఆనందమును కోలుపోవును. అనేక దేశములు వైజ్ఞానికోన్నత శిఖరముల నధిష్టించియు, తమ నాగరికతకు తామెంతయో గర్వించుచుండియు శాంతిభద్రతలు పొందగలిగినవా! భయభ్రాంతులకుగాని, అసూయాదంభములకుగాని గురికాకుండగ నున్నవా?

మానవునికి భౌతికముగా, మానసికముగా కొంత సుఖము అవశ్యకమే. కాని, ఆ సుఖ సాధనలు సాధించుటయే జీవిత లక్ష్యము కారాదు. ఒకమారు ఆ పద్ధతికి అలవాటు పడినచో యిక ఆశలకంతుండదు. కోరికలకు తుదియుండదు. తృప్తియనునది యెన్నటికీ లభించదు. సత్యాసత్యములను వివేచనమొనర్చు శక్తి క్రమక్రమముగా సన్నగిల్లును. అహంకారము నానాటికి పదునెక్కును. తిన్నకొలదీ తినవలెనను కోరిక, దాహము తీర్చిన కొలది త్రాగవలెనను కోరిక వృద్ధియగుచునే యుండుట భౌతిక సుఖముల లక్షణము. అదే వాటి నిజస్వరూపము.

నిజమగు సుఖమననేమో మీలోమీరు ప్రశ్నించకోవలెను. భౌతిక సుఖ పరికరములను పెంచిన కొలదీ అది లభించునా? లభించదు. నిజమగు సుఖసంతోషములు ఆత్మజ్ఞానము వలనే లభించును. తానెవరో తెలుసుకొన్నచో తాను సహజముగా ఆనందస్వరూపుడని గుర్తించినవాడే సుఖముయొక్క అనుభవము కలుగును. ఆనందమనునది బాహ్యప్రపంచమున లభించునది కాదు. అది మీలోనే దొరకును. ఆత్మసాక్షాత్కా మొనర్చుకొను నిమిత్తమే ఈ మానవజన్మమనెడి అవకాశము మీకు లభించినది. తానెవరో

తెలుసుకొనకుండగ, నీవెవరు అని ప్రతి వారిని అడుగుట వ్యర్థమేకదా! నా శరీరము, నా అవయవములు, నా బుద్ధి, నా దేహము, నా మనస్సు అని చెప్పునప్పుడు దేహముకంటె, బుద్ధికంటె, అవయవములకంటె, మనస్సుకంటె నీవు వేరని స్పష్టమగుటలేదా. వీటన్నిటినీ గలిగియున్నవాడెవరో వాడే నేను అని తెలుపబడుచున్నాడు.

ఈ 'అహం' అనే భావన సర్వజీవులకు సమానము. ప్రతి శ్వాసయందు విరాట్ స్వరూపమగు పరమాత్మయే (సః) నేను (అహం) అనెడు భావన ప్రతి మానవుడు పొందవలెను. ప్రతి ఉఛ్వాసనిశ్వాస వెంబడిని ఈ 'సోహం' అనెడి మంత్రము తనకు తెలియకుండగనే ఆవృత్తమగుచున్నది. సుషుప్తియందు ద్వంద్వభావన వుండదు. అదియిది అనెడి భావన పోయి అనగా 'సో' లోని 'స'కారము, 'హం'లోని 'హ'కారము లోపించి 'ఓం' కారము మాత్రమే మిగిలియుండును. ఇదే మూల ధ్వని, ప్రణవ నాదము. ఇదే జీవము, శక్తి. ఓంకారములో మనస్సును లయమొనర్చుకొన్న విశ్వచైతన్యమునుండి మీరు వేరుకాదని గుర్తించిన క్షణమందే మీ బాధలు, మీ దుఃఖములు అంతములగును. మానవుని అంతిమ ప్రాప్తినే వేదాంతమందుము. ఆ అంతిమ స్థితియే జ్ఞానము. జ్ఞానమే వేదాంతము. బ్రహ్మ విచారమనెడి ఆత్మజ్ఞాన పథమున బ్రహ్మచర్యముతో ప్రారంభించి, గృహస్థాశ్రమములోని ప్రాపంచిక సుఖసంతోషముల డక్కామొక్కీలకు లోనగుచు వివేక వైరాగ్యముల స్వరూపమగు వానప్రస్థాశ్రమము ద్వారా అత్యంత ఆధ్యాత్మిక పరిణితి రూపమగు సన్యాసాశ్రమములో నిష్ఠుడగును. జీవాత్మ, పరమాత్మ సంయోగమే యిట్టి జీవితమునకు అంతిమ ప్రాప్తి. నది సముద్రములో కలియుట అను లక్ష్యమును సాధించి, తన సత్యమునుగాని, రుచి నామములను యెట్లు కోల్పోవునో, అట్లే జీవుడు బ్రహ్మతత్త్వమును సాధించి తానే బ్రహ్మమగును.

మీరందరూ యేదో ఒకరూపమగు సేవను నొనర్చుచునే వున్నారను విషయము నాకు తెలుసు. కాని, సేవచేయుచున్న మీకుగాని సేవను పొందుచున్నవారికిగాని తగినంత ఆనందము లభించుటలేదనియు నేనెరుగుదును. స్వార్థ రహితమైన సత్యధర్మశాంతి మూలకమైన ప్రేమను అభివృద్ధి పరచుకొనుటకు ప్రయత్నించుము. మీరు చేయు సేవనుగాని, మీరు పొందు సేవనుగాని ప్రేమ అనెడి దృక్కోణమునుండి పరికించినచో ఆ సేవకు నిశ్చలమగునది పేరునకైనా వుండదు. సేవకుడు, సేవ్యుడు ఒకడే. ఇతరులను సేవించుట అనగా నీకు నీవు సేవయొనర్చుకొనుటయే. ఇతరుల బాధను చూచి నీవు బాధపడుటవలననే, ఆ బాధను నివారించుకొనుట కొరకైమాత్రమే నీవు యితరులను సేవించుట జరుగుచున్నది కదా! అట్టి భావము లేనిచో, పైపైకి గావించు సేవలన్నియూ వ్యర్థములే.